క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పంపిణీ



పుత్తూరు రూరల్: పుత్తూరు మండలం నేసనూరు సచివాలయ పరిధిలోని వడ్డిండ్లు గ్రామానికి చెందిన బి.లక్ష్మయ్య కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేశారు. లక్ష్మయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణం సాయం కింద మృతుని భార్య మంజులకు సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి రూ.10 వేలు అందజేశారు.

సమయపాలన తప్పనిసరి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మోహన్‌మురళి

కార్వేటినగరం: సచివాలయం ఉద్యోగులు సమయ పాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధినిర్వహణలో ప్రభుత్వం నిర్ణయించిన పని వేళలను తప్పక పాటించాలని ఆదేశించారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పీఎస్ మణి, సీనియర్ అసిస్టెంట్ జహీర్‌ఖాన్, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి

నింద్ర: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇరుగువాయి గ్రామ జగనన్న కాలనీలో నిర్మాణాలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ సమస్యలేమన్నా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పనులను వేగవంతం చేయాలని తెలిపారు.

వరి సాగుపై అవగాహన



సూచనలిస్తున్న ఏఓ

నింద్ర: రబీ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు అధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి తులసీరామ్ తెలిపారు. గురువారం అగరం గ్రామంలో వరి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో వరి సాగు చేయాలన్నారు. అనంతరం సాగులో ఉన్న వరి పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కలుపు నివారణ, ఎరువులు వాడకం, సస్యరక్షణ చర్యలను వివరించారు.

నేడు ద్విచక్ర వాహనం వేలం

పాలసముద్రం: మండలంలో అక్రమంగా సారా తరలిస్తుండగా సీజ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని శనివారం వేలం వేలం వేయనున్నట్లు శుక్రవారం ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతి చెందిన దేవికమ్మ

కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం మేరకు, మండల పరిధిలోని కేశవకుప్పం పంచాయతీ పసలవానిమిట్టకు చెందిన దేవికమ్మ(54) తమ బంధువులతో కార్వేటినగరంలోని పళ్లిపట్టు బస్టాండు వద్ద వేచి ఉన్న సమయంలో ఓ వాహనం అతివేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో తమ బంధువులు ఓ ప్రైవేటు వాహనం ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. ఆ మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గాయపడిన చిన్నారి..

పుత్తూరు రూరల్: ఈనెల 23వ తేదీ ఉదయం ఇంటి ముందు ఆడుకొంటూ ప్రమాదవశాత్తు పొయ్యిమీద పడి తీవ్రంగా గాయపడిన అనిక(4) చెన్నై కీళపాకం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మున్సిపాలిటి 1వ వార్డు పాతపల్లూరు గ్రామానికి చెందిన వి.బాలముని, శ్యామల మూడవ సంతానమైన అనిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వణికిస్తున్న వైరల్ ఫీవర్

- వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు
- జ్వర బాధితులతో ఆస్పత్రుల కిటకిట
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు



పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ కోసం వేచి ఉన్న రోగులు

ఇటీవల కురిసిన వర్షాలు, ప్రస్తుతం మంచుతో వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. నగరి నియోజకవర్గంలో ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా జలుబు, జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులతో రోగులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నిర్లక్ష్యం వహించకుండా తగిన సమయంలో వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

పుత్తూరు రూరల్: వాతావరణ మార్పులతో జ్వరాల బారిన పడుతున్న వారితో ప్రభుత్వాస్పత్రుల్లో రోజూ ఓపీ సంఖ్య పెరుగుతోంది. చాపకిందనీరులా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామెర్లు, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు సైతం ప్రజలకు రోగాల నుంచి ఉపసమనం కలిగిస్తున్నాయి. ఉచిత పరీక్షలు, చికిత్సలు, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. బ్యాక్టీరియాల కలుషిత నీటిని తాగడం ద్వారా టైఫాయిడ్, డయేరియాలతో పాటు దోమకాటు కారణంగా మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. వీటి నివారణ కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్య లు చేపడుతోంది. ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్యాక్టీరియా పెరుగుదలకు ప్రధాన కారణమైన నీటి నిల్వలు లేకుండా క్షేత్రస్థాయిలో సిబ్బంది తగిన చర్యలు చేపడుతున్నారు. క్లోరినేషన్ చేయిస్తున్నారు. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ పరిశుభ్రతను పాటించాల్సిందిగా అవగాహన కల్పిస్తున్నారు. రోగాల బారిన పడిన వారి రక్తనమూనాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఉచితంగా వైద్యంతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు.

తీసుకోవల్సిన జాగ్రత్తలు

- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి
- ఇంటి పరిసరాల్లో వినియోగించని టైర్లు, డ్రమ్ములు ఉంచరాదు
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు వహించాలి
- ఇళ్లలో కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి. దోమతెరలు వినియోగించాలి
- తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకుంటూ ఉండాలి
- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

సొంత వైద్యం వద్దు



జిల్లా వ్యాప్తంగా వివిధ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈనేపథ్యంలో సొంత వైద్యం ప్రమాదకరం. సొంత వైద్యం ద్వారా తాత్కాలికంగా జ్వరం తగ్గవచ్చు. అయితే ప్లేట్లెట్స్ తగ్గిపోయి మనిషి నీరసించి కిందపడిపోయే ప్రమాదం ఉంది. జ్వరం తగ్గినా ఒంట్లో నీరసం ఉంటే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఉచితంగా రక్త పరీక్షలు చేసుకోవచ్చు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుకోవాలి. వైద్య సిబ్బంది ఇంటి వద్దకే ఉచితంగా మందులను పంపిణీ చేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. –డాక్టర్ పి.రవిరాజు, డీఐఓ, చిత్తూరు జిల్లా

చేతి వృత్తులతో మహిళల ఆర్థికాభివృద్ధి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పాలసముద్రం: మహిళలు చేతివృత్తుల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని రూరల్ అక్షన్ సంస్థ నిర్వాహకుడు చిట్టిబాబు తెలిపారు. వీర్లగుడి దళితవాడలో శుక్రవారం కోయార్ బోర్డు వారి ఆధ్వర్యంలో మహిళలకు స్పిన్నింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ చేతివృత్తుల ద్వారా మహిళలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. తమ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిండర్ సంస్థ రవి, క్రాస్ సంస్థ భూపతి, రిటైర్డ్ టీచర్ ఆర్ముగం, ట్రైనర్లు లిల్లీ, రేఖ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ నమోదు జాబితాలు

నగరి: మండలంలో 1,712 మంది రైతులకు సంబంధించి 3,494 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేసినట్లు వ్యవసాయాధికారి రాఘవేంద్రయాదవ్ తెలిపారు. 14 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఖరీఫ్ 2023లో రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రాప్ సామాజిక తనిఖీలో భాగంగా నమోదు చేసిన జాబితాలను ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ఈనెల 29 తేదీ వరకు ఉంచుతామని, స్థానిక సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రతి రైతు భరోసా కేంద్రంలో గ్రామ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. రైతులు జాబితాలో వారి పేర్లు, పంట విస్తీర్ణం సరిచూసుకోవాలన్నారు. ఏవైన అభ్యంతరాలు ఉంటే రైతు భరోసా సిబ్బంది దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వాటిని పరిశీలించి సరిచేస్తామన్నారు.

క్రీడాకారులకు జెర్సీల అందజేత



జెర్సీలను చూపుతున్న సీఐ, ప్రిన్సిపాల్, విద్యార్థులు

నగరి: ప్రభుత్వ డిగ్రీకళాశాల క్రీడాకారులకు సీఐ సురేష్ కుమార్ 15 జతల జెర్సీలను వితరణగా అందించారు. శుక్రవారం కళాశాలకు వెళ్లిన ఆయన జెర్సీలను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా వ్యాయామ విభాగం వారు కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఏ లక్ష్యం కోసం వితరణ చేశారో దాన్ని పూర్తి చేసినపుడే సార్థకత ఉంటుందన్నారు. క్రీడాకారులు స్ఫూర్తితో విజయాలు సాధించి సహకరించిన దాతలకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సీఐ మాట్లాడుతూ తాము చదివే కళాశాలలో తమకంటూ ఒక పేజీ ఉండేలా విద్యార్థులు రాణించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రాజు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి రెడ్డినాయక్, అధ్యాపకులు ప్రేమ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



ఉష (ఫైల్)

గంగాధర నెల్లూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు, మండలంలోని కడపగుంటకు చెందిన శేఖర్, ఉష(46) దంపతులు నాలుగు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. శేఖర్ మృతి చెందగా, ఉష తీవ్రగాయాలతో తమిళనాడులోని ఓ ఆస్పత్రిలో చేరింది. ఆమె చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆపదలో ఆదుకునే 108

- ప్రాణాలను నిలబెడుతున్న అంబులెన్స్
- ఫోన్ చేస్తే 15 నిమిషాల్లో సంఘటన స్థలానికి
- అంబులెన్స్‌లో 562 మంది జననం



108 అంబులెన్స్‌లో జన్మించిన బిడ్డ (ఫైల్)



నవజాత శిశువుల అంబులెన్స్

పాలసముద్రం: అత్యవసర సమయంలో బాధితులను ఆదుకుంటోంది 108 అంబులెన్స్. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 108 అంబులెన్స్‌కు ఊపిరి పోసింది. కోట్లాది రూపాయల నిధులు సమకూర్చి మండలానికో 108 వాహనాన్ని, అందులో అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చింది. ఫలితంగా వేలాదిమంది క్షతగాత్రుల ప్రాణాలను నిలబెడుతున్న ఈ 108 వాహనం ఆపద్బాంధవిగా పేరు తెచ్చుకుంది. ఎంతో మంది ప్రమాదాలకు గురై రోడ్డు మీద ఆర్తనాదాలు చేస్తూ ఆదుకునేవారి కోసం ఎదురుచూస్తున్న వారిని ఈ అంబులెన్స్ ఆదుకుంటోంది. నిండు గర్భిణుల ప్రసవ వేదనను తీర్చుతూ వేలాది మందికి పురుడు పోసిన ఘనత 108కే దక్కుతుంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఈ ఏడాది అంబులెన్స్‌లో పురుడు పోసుకున్న శిశువులు 562 మంది ఉండడం విశేషం. అదే విధంగా రోడ్డు ప్రమాదాలకు గురైన 9,856 మందిని ఆస్పత్రికి తరలించిన ఘనత 108 అంబులెన్స్‌కు దక్కింది.

అత్యవసర సమయాల్లో..

నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, గుండెపోటు, ఆయాసం వంటి ఎన్నో సంఘటనల్లో దిక్కుతోచని సమయాల్లో బాధితులకు గుర్తు వచ్చేది 108 అంబులెన్స్. ఫోన్ చేసిన 15 నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకుని, బాధితులను అక్కున చేర్చుకుని, వారికి అండగా నిలుస్తోంది. గర్భిణుల కోసం వాహనాల్లో ప్రత్యేకంగా నియోనేటర్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ప్రథమ చికిత్స కోసం ఆక్సిజన్, బీపీ, పల్స్ చూసేందుకు అవసరమైన ఆధునిక పరికరాలు, ప్రసవం చేసేందుకు ఎమర్జెన్సీ డిస్పోజల్ డెలివరీ కిట్లను వాహనంలో ఉంచారు. అత్యవసర సమయాల్లో చికిత్స కోసం హెడ్ ఆఫీస్‌కు ఫోన్ చేసి సలహాలు తీసుకుని ఈఎంటీలు (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) వైద్యం అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఫోన్ వచ్చిన 15 నిమిషాల్లో అక్కడికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలో ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడుతున్నారు. గతంలో రోగులను మెరుగైన చికిత్స కోసం తరలించేందుకు 108 వాహనానికి 30 కిలోమీటర్లు మాత్రమే పరిమితం ఉండేది. ప్రస్తుతం రోగిని కాపాడేందుకు జిల్లాలో ఏ ఆస్పత్రికైనా తరలించేందుకు వెసులుబాటు ఉండేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. కోవిడ్ సమయంలోనూ మండల పరిసర ప్రాంతాల్లో రోగులను క్వారంటైన్‌లకు తరలించడంలో ఈ అంబులెన్సులు కీలకపాత్ర పోషించాయి. ఈ సంవత్సరం మే 9వ తేదీన మండలంలోని ఇందిరానగర్ ఆదిఆంధ్రవాడకు చెందిన గర్భిణికి పురిటినొప్పులు వచ్చాయి. బంధువులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. 15 నిమిషాల్లో అక్కడికి చేరుకుని ఆమెను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళుతుండగా, మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ రాధ ఫోన్ ద్వారా వైద్యాధికారులతో మాట్లాడి వారి ఆదేశాల మేరకు మహిళకు వాహనంలోనే సురక్షితంగా కాన్పు చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆమె కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలా ఎంతో మందికి అత్యవసర సమయంలో 108 సిబ్బంది సేవలు అందించారు.

108 వాహనంలో ప్రసవం



అనుకోకుండా అర్ధరాత్రి నాకు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. బంధువులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. వారు వెంటనే స్పందించి మా గ్రామానికి చేరుకున్నారు. నాతోపాటు కుటుంబసభ్యులను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. మార్గమధ్యంలోనే 108 సిబ్బంది సురక్షిత కాన్పు చేశారు. నాకు మగబిడ్డ పుట్టాడు. ఆ సంతోషం మాటల్లో చెప్పలేం. 108 సిబ్బందికి, ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. –హేమలత, ఇందిరానగర్

సకాలంలో ఆస్పత్రికి తరలిస్తున్నాం



108 అంబులెన్స్ ద్వారా సకాలంలో బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్నాం. అన్ని వాహనాల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు ఉన్నాయి. అత్యవసర సమయంలో గర్భిణులకు, అప్పుడే పుట్టిన పిల్లలకు ప్రథమ చికిత్స చేయడానికి ఎమర్జెన్సీ కిట్లు అందుబాటులో ఉంచాం. అలాగే మానిటర్, ఆక్సిజన్ ఇతర అత్యాధునిక సౌకర్యాలు కల్పించాం. ఆపద సమయంలో బాధితులను కాపాడటమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నాం. –బి.మోహన్‌బాబు.108 జిల్లా మేనేజర్

నవజాత శిశువులకు సదుపాయాలు



నవజాత శిశువులకు అవసరమయ్యే ప్రత్యేక అంబులెన్సులు ఈ జిల్లాకు మూడు వచ్చాయి. బరువు తక్కువగా కానీ, నెలల నిండకుండా కానీ జన్మించే పిల్లలకు ఇంకుబేటర్, వెంటిలేటర్ వంటి ప్రత్యేక సదుపాయాలున్నాయి. శిశువులను సురక్షితంగా స్వగ్రామానికి చేరుస్తున్నాం.108 వాహనానికి ఫోన్ చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో 20 నిముషాలు, పట్టణ ప్రాంతాల్లో 15 నిమిషాలు, గిరిజన ప్రాంతాల్లో 30 నిముషాల వ్యవధిలో చేరుకుంటున్నారు. –ప్రతాప్, 108 మేనేజర్, చిత్తూరు డివిజన్

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. హెచ్‌ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా స్థాయిల్లో పుత్తూరు పట్టణం ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన అండర్ 17, అండర్ 19 గేమ్ సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో నవ్య, ఇందు, ఉమా, తరుణ్ ప్రతిభను ప్రదర్శించి ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ఎస్ఎంసీ చైర్మన్ మునికృష్ణ, పాఠశాల ఉపాధ్యాయుల బృందం, గ్రామ పెద్దలు అభినందించారు.

డీఎం పురం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

కార్వేటినగరం: పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జిల్లా స్థాయిలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో డీఎం పురం విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కేశవులు అన్నారు. వీరిని శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. హెచ్‌ఎం మాట్లాడుతూ అండర్ –17 బాల బాలికల జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో 10వ తరగతి చదువుతున్న యశ్వంత్, కావేరి ఎంపికైనట్లు వివరించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల మృతికి నివాళి



నగరి: రామ్మూర్తి మృతదేహానికి నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి: నగరి మండలంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలను పార్టీ నాయకుడు, మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. తెరణి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మూర్తి శుక్రవారం ఆకస్మికంగా మృతిచెందారు. రామ్‌ప్రసాద్ రెడ్డి ఆగ్రామానికి వెళ్లి రామ్మూర్తి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కృష్ణారామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుధాకర్ మరణించగా, భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. మంత్రి ఆదేశాల మేరకు వైఎస్సార్ భీమా రూ.లక్ష బాధిత కుటుంబానికి త్వరగా అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ భార్గవి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, నాయకులు డింపుల్, యేసు, గుణశేఖర్ రెడ్డి, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పుత్తూరు రూరల్ మండలం వేపగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోపికృష్ణ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.15 వేలు సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా, జగనన్న ఇళ్లు వంటి పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

నెల్లేపల్లి పాఠశాలకు క్రీడా పరికరాల వితరణ



క్రీడా పరికరాలు అందుకున్న విద్యార్థులు

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బెంగళూరుకు చెందిన జాయిన్ ద డాట్ సంస్థ ద్వారా రూ.70వేల విలువైన ఆట వస్తువులు శుక్రవారం ఆ సంస్థ సభ్యురాలు శిల్ప అందజేశారని పాఠశాల హెచ్‌ఎం సుబ్బరత్నమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసం కోసం ఆటలు కూడా ముఖ్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో చేస్తున్న అభివృద్ధికి తోడుగా దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయమని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, యుగంధర్ ఆచారి, వ్యాయా మ ఉపాధ్యాయులు లక్ష్మయ్య, జాయిన్ ద డాట్ సంస్థ సభ్యురాలు శిల్పని సత్కరించి, ధన్యవాదాలు తెలియజేశారు.

సురక్షతో అందరికీ ఉచిత వైద్యం



సురక్ష కిట్లను అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధర నెల్లూరు: మండలంలోని వీరక నెల్లూరు గ్రామ ఎంపీపీ పాఠశాల ఆవరణలో శుక్రవారం కొండేపల్లి సర్పంచ్ గోవింద స్వామి, ఎంపీటీసీ ఇందిర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీడీవో శ్రీదేవి ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వారి గ్రామాల్లోనే స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం కంటికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండన్, ఈవోపీఆర్డీ రాఘవేంద్ర రాజు, డాక్టర్ల బృందం దుర్గా దేవి, దివ్య, పావని చంద్ర, హరిక్రిష్ణ, ఐసీడీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలు లేకుండా చూడాలి



చౌక దుకాణంలో తూనికల స్కేల్‌ను పరిశీలిస్తున్న మల్లేశ్వర్

పాలసముద్రం: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకుల తూకాల్లో తక్కువ లేకుండా చూడాలని జిల్లా తూనికల ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ తెలిపారు. మండల పరిధిలోని చౌకదుకాణంలో ఉన్న తూనికల స్కేల్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. డీలర్లతో ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులను తూనికల్లో తేడాలు లేకుండా అందజేయాలన్నారు.ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు సకాలంలో అందించాలని తెలిపారు. చౌక దుకాణంలోని తూకాలను ఏడాదికో సారి సరిచేసుకోవాలని సూచించారు. అనంతరం తూనికల స్కేలును పరిశీలించారు. కార్యక్రమంలోని మండల పరిధిలోని డీలర్లు పాల్గొన్నారు.

ఎస్టీల భూములను పరిరక్షించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, ఎస్టీలు

నగరి: ఎస్టీల భూములు ఆక్రమణకు లోనుకాకుండా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఓజీ కుప్పం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్టీలు శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. తహసీల్దార్‌ను కలిసి వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్టీలకు రెవెన్యూ అధికారులు భూములు కొనుగోలు చేసి పట్టాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం సమీప రైతులు తమ భూములు విస్తీర్ణం తగ్గిందని, అది ఎస్టీలకు పట్టాలు ఇచ్చిన భూముల్లో కలిసి ఉందంటూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఎస్టీలకు పట్టాలిచ్చిన భూములు వారికే చెందేలా చర్యలు చేపట్టాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మధు, వైస్ఎంపీపీ పరశురాం, ఎస్టీలు పాల్గొన్నారు.